క్లుప్తంగా

డీఎంహెచ్‌ఓను కలిసిన 104 నూతన మేనేజర్



డీఎంహెచ్‌ఓను మర్యాదపూర్వకంగా కలిసిన 104 మేనేజర్ దుర్గాప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా 104 వాహనాల మేనేజర్‌గా పూసర్ల వెంకటదుర్గాప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బి. జగన్నాథరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఇంతవరకు విజయనగరం జిల్లాలో పనిచేస్తూ పదోన్నతిపై పార్వతీపురం మన్యం జిల్లాకు 104 మేనేజర్‌గా వచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 104 వాహన సేవలు మరింత మెరుగుపడాలని డీఎంహెచ్‌ఓ ఈ సందర్భంగా ఆయనకు సూచించారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పోషకాహారం అవసరం



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

బలిజిపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోరీ బాలికలకు ఆరోగ్యం, పోషకాహారంపై పూర్తి అవగాహన కల్పించి వారికి సరైన ఆహారాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఈఓ) జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అజ్జాడలో జరిగిన ఆరోగ్యం, పారిశుధ్యం, పోషకాహార కమిటీ సమావేశానికి ఆయన బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులను త్వరగా గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. రక్తహీనత, హై రిస్క్ లక్షణాల సూచికలకు గురికాకుండా చూడాలని చెప్పారు. నవజాత శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ, టీకా నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. కిశోరీ బాలికల్లో రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి నెలా సమావేశాలు నిర్వహించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గణేష్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాల్సిందేనని ఎస్ఐ బి.శివప్రసాద్ స్పష్టం చేశారు. పాలకొండ – వీరఘట్టం రహదారిలో వైఎస్సార్ కూడలి వద్ద ముమ్మర వాహన తనిఖీలు బుధవారం చేపట్టారు. ఈ క్రమంలో వాహనాల ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు సరి చూశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక సంఖ్యలో ప్రయాణికులతో వస్తున్న రెండు ఆటోలను గుర్తించి కేసులు నమోదు చేశారు.

సకాలంలో టీకాలు వేయించాలి



వ్యాధుల, టీకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించటం ద్వారా వారి ఆరోగ్య రక్షణకు భరోసా లభిస్తుందని అన్నవరం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ కె.రాణి అన్నారు. బుధవారం మండలంలోని లుంబూరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ప్రాణాంతక వ్యాధులు, వాటి రక్షణకు అందిస్తున్న టీకాలు, ఉచిత మందులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందిస్తున్న సేవలు, రక్తహీనతను అధిగమించేందుకు ప్రభుత్వం ద్వారా సమకూరుస్తున్న పౌష్టిక ఆహారం అవశ్యకతపై తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు క్రమం తప్పకుండా వైద్యుల సూచన మేరకు టీకాలు వేయించాలన్నారు.

రైతు అవసరాలు తీర్చండి

భామిని: రబీలో సాగవుతున్న మొక్కజొన్న పంటకు అవసరమైన ఎరువులను అందించాలని, పంటకు అవసరం మేరకు ఇండెంట్లు పెట్టాలని బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ వ్యవసాయాధికారులను కోరారు. బాలేరు రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శాఖాపరమైన కార్యక్రమాలను రైతులకు అవసరమైన రీతిలో నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు సాగు చేస్తున్న మొక్కజొన్నకు అవసరమైన ఎరువులకు ఇండెంట్ పెట్టకపోవడంపై ఎంఏఓ సింహాచలంను నిలదీశారు. రైతులకు సస్యరక్షణ చర్యలు వివరించారు.

నవరత్నాలతో నవశకం

● ఎమ్మెల్యే జోగారావు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో రాష్ట్రంలో నవశకం ప్రారంభమైందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం పలగరలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడగడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు ఇంతవరకు అందని పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్‌లు అందజేసి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లాంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే అని తెలిపారు. అమ్మ గర్భంలో పిల్ల ఉన్నది మొదలు ఉన్నతమైన చదువులు చదుకునేంతవరకు ప్రభుత్వమే సంక్షేమ పథకాలను అందిస్తోందని చెప్పారు. అదేవిధంగా రైతులకు రైతు భరోసా, నిరుపేదలకు సొంతిల్లు, మహిళల జీవనోపాధి మెరుగుదలకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తోందని వివరించారు.

నాడు నేడుతో సమూల మార్పులు

ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్‌లో నాడు–నేడు పథకంతో సమూల మార్పులు తీసుకువచ్చింది జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వంలో ఇటువంటి సంక్షేమం, అభివృద్ధి ఎక్కడ ఉందో ప్రజలు గమనించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందుతున్నాయో? లేదో? తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తూ ప్రజలకు భరోసా అందిస్తున్నామన్నారు. గ్రామాలకు వెళ్లేటప్పుడు చిన్న, చిన్న సమస్యలపై ప్రజలు అందించే సూచనలు, సలహాలు పాటించి వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరమ్మ, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైస్ ఎంపీపీ వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎస్.భాస్కరరావు, కె.సత్యంనాయుడు, జాన్, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు రామకృష్ణనాయుడు, కె.వెంకటరమణ, జగన్, టి.ప్రసాదరావు, ఎస్.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



జగనన్న లేఅవుట్ కాలనీలో వేస్తున్న విద్యుత్ స్తంభాలు

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనలో భాగంగా కొత్తగా విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఏగోటివలస, జోగింపేట గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన వినతుల మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న కాలనీల్లో లేఅవుట్‌లు వేసినపుడే మంచినీరు సౌకర్యం కల్పించడానికి అవసరమైన విద్యుత్ మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్న మండలకేంద్రంలోని కమలాతోట జగనన్న కాలనీలో రెండు, ఏగోటివలస జగనన్నకాలనీలో 1, జోగింపేట గ్రామంలో 1 ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చామని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి సిబ్బంది సహకారంతో సిద్ధంగా ఉంటామన్నారు.

భూహక్కు పత్రాలు శతశాతం పంపిణీ చేయాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీఆర్‌ఓ వెంకటరావు

● డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: జగనన్న భూహక్కు పథకం ద్వారా భూములు రీసర్వే చేసి ప్రభుత్వం అందజేస్తున్న భూహక్కు పత్రాల పంపిణీ శతశాతం పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. రీ సర్వేకు సంబంధించి ప్రతి మండలానికి ప్రత్యేకంగా నియమించిన డిప్యూటీ తహసీల్దార్లతో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ రికార్డులను శుద్ధీకరణ చేసిన అనంతరం, భూముల రీ–సర్వే చేసి భూ హక్కు పత్రాలు తయారవుతాయని తెలిపారు. మొదటి దశలో నిర్వహించిన రీ–సర్వే అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన భూ హక్కు పత్రాలను వెంటనే భూయజమానులకు అందజేయాలని చెప్పారు. రెండురోజుల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. భూరికార్డుల తయారీలో కీలకమైన గ్రామరెవెన్యూ అధికారులు సరైన వివరాల నమోదులో అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐసీఇ డివిజినల్ మేనేజరు మూర్తి, సూపరింటెండెంట్ రవికుమార్, డీఐఓ రామకృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డులు : ఎంపీడీఓ



చిన్నారుల బరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని పెద్దూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, సరుకుల వివరాలను పరిశీలించారు. ఆహార పదార్థాల రుచిని చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం అమలు చేయాలన్నారు. పిల్లలకు సంబంధించిన ఎత్తులు, బరువుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పరిశీలనలో సచివాలయ కార్యదర్శి బి.సుభద్ర, అంగన్‌వాడీ వర్కర్ ఈశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు అప్పలనాయుడు

పాలకొండ: రైతుల నుంచి ధాన్యం పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. పట్టణంలో రైతు సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు మరింత గడువు పెంచాలని కోరారు. ఈ మేరకు రైతు భరోసా కేంద్రాల్లో వినతిపత్రాలు అందించాలని రైతులకు సూచించారు. సమావేశంలో కమిడి రామూర్తి, బివి.రమణ, శంకరావు, రమణమూర్తి, పిట్ట రమణ తదితరులు పాల్గొన్నారు.

భూ పత్రాలు సిద్ధం చేయండి



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్

పాలకొండ: ప్రభుత్వం కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించిన భూములకు సంబంధించి భూ సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని వీఆర్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించిన ఆయన గ్రామాల వారీగా ఎసైన్డ్ భూములకు సంబంధించిన వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి భూముల సర్వే పూర్తి చేసి సంబంధిత రైతుల పేరుతో భూ హక్కు పత్రాలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆయనతో పాటు టీడీ బుచ్చయ్య ఉన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధినిరోధక టీకాలు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్ రామారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి సోకే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తచర్యగా వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 28 వరకూ వ్యాక్సిన్ వేయాలని ప్రభుత్వం నిర్ధారించిన మేరకు ఇంతవరకూ గ్రామీణ, రైతు భరోసా కేంద్రాల పశువైద్యుల సహకారంతో 4,976 గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేశామన్నారు. పశువైద్యులు గ్రామాల్లో వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను మేకలు, గొర్రెల కాపరులు, రైతులు వేయించుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా

పాచిపెంట: మండలంలోని మోసూరు పంచాయతీ సురగడవలస సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశాలోని గొల్లూరుకు చెందిన కొంతమంది కూలీలు మోసూరు సమీపంలో సురగడవలస వద్ద పొలంపనులకు వెళ్లి తిరిగి ట్రాక్టర్‌లో వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గెమ్మెల పైడమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు.

నిబంధనల మేరకు పనులు



చిన్నమంగళాపురంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: మండల పరిధిలోని ఉపాధి హామీ జాబ్ కార్డుదారులు నిబంధనల మేరకు పనులు చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. గోపాలపురం, గొట్టమంగళాపురం, యరకారాయపురం, చిన్నమంగళాపురంతో పాటు ఇతర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల తీరును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పనుల పరిశీలనకు గురువారం రాష్ట్ర బృందం వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత సిబ్బంది పూర్తి స్థాయి వివరాలతో కూడిన రికార్డులు సిద్ధం చేయాలన్నారు.

గిరిజన ఉత్పత్తులు విక్రయించండి



మాట్లాడుతున్న వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గండిపల్లి సింహాచలం

● వైకేపీ ఏపీఎం గండిపల్లి సింహాచలం

సాలూరు: వన్‌ధన్ కేంద్రాలలో గిరిజన ఉత్పత్తులను విక్రయించాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గండిపల్లి సింహాచలం తెలిపారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు కొఠియా గ్రామాలైన కొదమ, పట్టుచెన్నేరు ప్రాంతాలలో గిరిజన మహిళలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఐటీడీఏ పీఓల ఆదేశాల మేరకు పసుపు, చింతపండు, అపరాలు కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఏయే గ్రామాల్లో ఏ పంట ఎంత దిగుబడి వస్తుందో వీఓఏల ద్వారా సర్వే చేయించామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను నమ్మవద్దని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పట్టణంలో మహిళా మార్ట్‌ను ప్రారంభించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కొఠియా గ్రూప్ గ్రామాల మహిళా సంఘాలు, సీసీలు నిర్మల, కృష్ణవేణి, సంజీవరావు, రామకృష్ణ, అనిల్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ అభివృద్ధే ధ్యేయం

● కమిషనర్ రామప్పలనాయుడు



మున్సిపల్ పార్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: మున్సిపాల్టీ అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని మున్సిపల్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి వర్మీకంపోస్టు, సాలిడ్ మేనేజ్‌మెంట్‌గా తయారు చేసి సంపదను సృష్టిస్తున్నామని చెప్పారు. తద్వారా మున్సిపాల్టీకి ఆదాయం చేకూరుతోందన్నారు. బెలగాంలోని మున్సిపల్ పార్క్‌లో వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశామని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని ప్రతి వార్డులో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశామని, వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిశుభ్రతకు సహకరించి తమ వార్డుల్లో కేటాయించిన డస్ట్‌బిన్లలో చెత్త వేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

భూ హక్కు పత్రాల పంపిణీ



భూ హక్కు పత్రాలు అందజేస్తున్న డీటీ, సర్పంచ్ తదితరులు

పాలకొండ: సమగ్ర భూ సర్వేలో భాగంగా చింతాడ గ్రామంలో సర్వే పూర్తి చేసిన అధికారులు బుధవారం భూ హక్కు పత్రాలు రైతులకు అందించారు. మొబైల్ టీడీ సన్యాసిరావు ఆధ్వర్యంలో సర్పంచ్ దుప్పాడ కళావతి చేతుల మీదుగా వీటిని అందించారు. గ్రామంలో మొత్తం 350 మందికి భూ హక్కు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ గ్రామంలో సర్వే పూర్తి చేశామని తెలిపారు. ఎక్కడా తప్పులు లేకుండా పత్రాలు సిద్ధం చేశామని తెలిపారు. రైతులకు సందేహాలు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రజల చెంతకు సచివాలయ సేవలు



దశుమంతపురం సచివాలయం ప్రగతిపై ఆరా తీస్తున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ

వీరఘట్టం: సచివాలయ సేవలు ప్రజలకు చేరువ చేయాలని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని దశుమంతపురం సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ సచివాలయం ద్వారా అందుతున్న పౌర సేవలను స్వయంగా పరిశీలించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం, మంచినీటి వసతులు ఎలా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్వయంగా బీపీ చెక్ చేయించుకుని వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ వర్తించేలా చూడాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ ఉన్నారు.

గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు



రెల్ల గ్రామంలో మేకలు, గొర్రెలకు వేస్తున్న పీపీఆర్ టీకాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల రైతు భరోసా కేంద్రం పరిధిలోని గిరిజన రైతుల గొర్రెలు, మేకలకు చిన్నపారుడు రోగం (పీపీఆర్) నివారణకు గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో లైవ్ స్టాక్ పశుసంవర్ధక సహాయకులు బుధవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రైతులతో మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించడం వలన పెదాల పైన, నాలుక పైన, నోటి లోపల వచ్చే చిన్న చిన్న పొక్కులు, రక్తంతో కూడిన చీమిడి మరియు దగ్గు, దుర్వాసనతో కూడిన విరేచనాలు వంటి లక్షణాలను అరికట్టవచ్చన్నారు. టీకాల కార్యక్రమాన్ని ఎంపీపీ కుంబురుక దీనమయ్య పరిశీలించారు.

సచివాలయ ఉద్యోగులు మెరుగైన సేవలందించాలి



సచివాలయ ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రజలకు వివరిస్తూనే వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి సచివాలయ ఉద్యోగులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బి.కృష్ణ మహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని సూరంపేట సచివాలయంలో ఉద్యోగుల హాజరు, శాఖల వారీగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రగతిపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ శాఖలద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, పథకాలు ఏవిధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకుని, ఇంకేమైనా పథకాలు పొందడానికి అర్హులుంటే వారి వివరాలను లిఖిత పూర్వకంగా సేకరించి డిజిటల్ సహాయకుల దగ్గర కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని సూచించారు.

ప్రభుత్వనిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మౌలిక సదుపాయాలు, జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఇళ్లసర్వేలో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలి

అందరికీ అత్యవసరమైన ఆధార్ నంబర్ అప్‌డేట్ చేయడానికి ప్రభుత్వం మండలంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ప్రజలు, విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రేణుక పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఫోన్‌నంబర్, చిరునామా, ఇతర తప్పులేమైనా ఉంటే వాటిని పూర్తి స్థాయిలో సరిదిద్దడానికి రెండు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరగనున్న ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు టి.రవికుమార్, దాసరి రామకృష్ణ పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటుకు సమయ పాలన పాటించాలి

ఉపాధిహామీ పనులు చేస్తున్న శ్రమ శక్తి సంఘాల సభ్యులకు కల్పిస్తున్న వేతనం గిట్టుబాటయ్యేందుకు గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో పాల్గొనే వేతనదారులంతా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం చినభోగిలిలో జరుగుతున్న ఉపాధి పనులలో పాల్గొన్న వేతనదారుల మస్తరును ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పని చేయాల్సిన మార్కింగ్ చేసిన మార్జిన్ విస్తీర్ణంలో పనిచేసి గిట్టుబాటు వేతనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు, మేట్‌లు పాల్గొన్నారు.